
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 6 మే 2025



లారీలో పరిమితికి మించి ఉన్న ఇసుకను తీస్తున్న దృశ్యం

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!

- నిబంధనలు బేఖాతరు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అదనపు బకెట్ పేరిట వసూల్ దందా
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

ములుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఇసుకా సురులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా జీరో దందాను సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదనపు బకెట్ పేరిట వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పగలు, రేయి అనే తేడా లేకుండా ఈ దందా కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా తమ కేమి పట్టనట్లుగా సంబంధిత శాఖ అధికారులు మామూలుగానే వ్యవహరిస్తున్నారు.

ఖనిజ సంపదే వారి జీవనోపాధి..


ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతం.. ఇక్కడ ఖనిజ సంపదకు కొదవ లేదు. చుట్టూ అడవి, పెద్ద పెద్ద గుట్టలు, గోదావరి, వాగులు, వంకలతో కళకళలాడుతూ ఉంటుంది. వాటిపై ఆధారపడి ఆదివాసీలు, గిరిజనులు జీవనం కొనగిస్తుంటారు. ఇక్కడ దొరికే ప్రతీ దానిపై వారికి హక్కు ఉంటుంది. జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాలైన మండలాలు ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో ఇసుక పుష్కలంగా లభిస్తుంది. దీంతో ఆదివాసులు సొసైటీలను ఏర్పాటు చేసుకుని ఇసుక ర్యాంపులు ద్వారా జీవనోపాధిని పొందేలా ప్రభుత్వం చూస్తుంది. అయితే ఇక్కడ కొందరు రేజింగ్ కాంట్రాక్టర్లు ఆదివాసీల హక్కులను హరిస్తూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తోడుకెళ్తున్నట్లు ఆదివాసీలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్

ఇసుక క్వారీలలో మైనింగ్ పనులు చేపట్టాలంటే పలు నిబంధనలు తప్పనిసరి. అయితే జిల్లాలో కొందరు రేజింగ్ కాంట్రాక్టర్లు అవి వారికేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాలు ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరుకు తవ్వకాలు చేపట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు చెబుతున్నాయి. ఇందుకు కాస్త వెసులుబాటు కల్పిస్తూ రాత్రి 9గంటల వరకు తవ్వకాలు నిర్వహించవచ్చని టీజీఎండీసీ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే 2 మీటర్ల లోతు కన్నా ఎక్కువ తోడకూడదనే నిబంధన కూడా ఉంది. వీటితో పాటు ఓవర్‌లోడ్, పెసా చట్టం అమలు వంటి పలు నిబంధనలు ఉన్నాయి. లారీలలో కూలీల ద్వార ఇసుక నింపించడం ద్వార అక్కడ ఉన్న ప్రజలకు కాస్త జీవనోపాధి దొరుకుతుంది. అయితే పలువురు కాంట్రాక్టర్లు ఇవేవి వారికి పట్టవన్నట్లుగా జేసీబీలు, ప్రొక్లెయిన్‌లను పెట్టి లారీలలో ఇసుక నింపిస్తూ మా పొట్ట కొడుతున్నారని పలు ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. లారీల్లో అదనపు బకెట్ వేస్తూ టన్నుకు అదనంగా డబ్బులు వసూల్ చేస్తున్నారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని వారు చెబుతున్నారు. ఈ తతంగమంతా కొందరు అధికారుల కనుసన్నలలోనే జరుగుతుందని అంటున్నారు.

ఇసుకను నిబంధనలకు మించి లారీలలో లోడ్ చేయ డానికి లేదు. అయితే కొన్ని చోట్ల పలువురు కాంట్రాక్టర్లు అదనపు బకెట్ పేరిట వసూళ్లకు పాల్పడు తున్నారనే ఆరో పణలు వినిపిస్తున్నాయి. ఉద యం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పోలీస్. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు క్వారీల వద్ద, కాంటాల వద్ద విధులు నిర్వహిస్తూ లారీలలో ఉండాల్సిన ఇసుక కంటే ఎక్కువ ఇసుక ఉంటే వెంటనే ఎక్కువ ఉన్న ఇసుకను లారీల నుంచి కింద పోయిస్తున్నారు. అయితే రాత్రిళ్ల వారు ఉండక పోవడంతో కొందరు కాంట్రాక్టర్లు విచ్చల విడిగా అదనపు బకెట్ దందాకు తెరలేపి సొమ్ముచే సుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కాంటాల వద్ద వెయింగ్ చూశాక ఇసుక ఎక్కువ ఉంటే దానిని తొలగిస్తు న్నారు. ఆ ఇసుకను వేరే లారీలో నింపి దాని ద్వార వచ్చిన సొమ్మును ప్రభుత్వాని అప్పగించాల్సి ఉంటుంది. అయితే కొందరు ఆ ఇసుకను అనధికారికంగా వేరే వారికి అమ్మి వచ్చిన సొమ్మును వారి జేబులో వేసు కుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు షెడ్యూల్ తెగలకు చెందాల్సిన హక్కులను వారి అధికారంతో దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఇసుక మైనింగ్ గిరిజన సొసైటీల ద్వార మాత్రమే జరపాలని, అలాంటిది టెండర్లకు పిలిచి బడా కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు లాభపడుతున్నారని, దీంతో పేసా చట్టం లక్ష్యం నీరుగారిపోతుందని అంటున్నారు. కొందరు రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు అధికారులను గుప్పెట్లో పెట్టుకుని పేసా గ్రామ సభలు సేచ్ఛగా జరగకుండా చట్టాలను చేతుల్లోకి తీసుకుని, చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ములుగు జిల్లాలో అధికారంగా 11 ఇసుక క్వారీలు నడుస్తున్నట్లు సమాచారం.



లారీలో జేసీబీ ద్వార ఇసుక నింపుతున్న దృశ్యం

ప్రజావాణి దరఖాస్తుల్లో భూ సమస్యలే అధికం

ములుగు కలెక్టర్ దివాకర



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

ములుగు, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 45 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో భూ సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు అందాయని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగితిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి పోర్టల్‌లోని పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సూచించారు. సోమవారం వచ్చిన 45 దరఖాస్తులలో 16 దరఖాస్తులు భూ సమస్యలపై, 14 దరఖాస్తులు గృహనిర్మాణ శాకకు, 2 దరఖాస్తులు పెన్షన్ కోసం, ఒక దరఖాస్తు ఉపాధి కోసం, ఇతర శాఖలకు సంబంధించినవి 12 దరఖాస్తులు అందుకున్నామన్నారు. వాటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను జవాబుదారితనంతో తక్షణమే పరిష్కరించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అనే దృష్టితో ప్రతి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికా రులు విధులు నిర్వహించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. ప్రజావాణిలో 52 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, మే 5, (ఆంధ్రజ్యోతి) :గిరిజనులు గిరిజన దర్బార్‌లో తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరిగతిన పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్‌ను నిర్వహించి గిరిజనుల వద్ద నుంచి పీవో వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 14మంది గిరిజనులు తమ సమస్యలను పీవోకు విన్నవించారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలలో సీఆర్టీగా ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడ్వాయి మండలం రంగాపురం గ్రామానికి చెందిన నీలమ్మ పీవోకు వినతి పత్రం అందించారు. గిరివికాస పథకం ద్వారా గ్రామంలోని 14 మంది రైతుల పొలాల్లో మోటార్లు, బోర్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన మంకిడి క్రిష్టయ్యతో తదితర రైతులు పీవోకు వినతి పత్రం అందించారు. భర్త పేరు మీద ఆర్వోఎఫ్ పట్టా ఉందని, ఇటీవల కాలంలో అనారోగ్యంతో భర్త చనిపోవడం జరిగిందని, తన పేరు మీద భూమిని భార్యకు పట్టా చేయాలని కన్నాయిగూడెం మండలానికి చెందిన కోరగట్ల స్రవంతి పీవోకు వినతికు మొరపెట్టుకున్నారు. అదేవిధంగా కన్నాయిగూడెం మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని తుడుం దెబ్బ సీనియర్ నాయకుడు పోడెం బాబు పీవోకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఐటీడీఏ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

భూ భారతితో సమస్యలు పరిష్కారం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, మే 5(ఆంధ్రజ్యోతి): భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన రేగొండ మండలంలో జరుగుతున్న అవగాహన సదస్సులో దరఖాస్తు చేసుకున్నవారికి వచ్చే నెలలో పట్టా పాస్‌బుక్‌లు అందజేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కోటంచ, లింగాల గ్రామాలలో భూభారతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణిలో అనేక లోపాలు ఉండడంతో ప్రజా ప్రభుత్వం మేధావులు, రైతు సంఘాలతో చర్చించి అనేక రాష్ట్రాల్లో పరిశీలించి భూభారతిని తీసుకొచ్చిందన్నారు. ధరణి వ్లల పట్టా జారీలో పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేక కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. భూములు కొన్నా అమ్మినా లైసెన్స్‌డ్ సర్వేయర్ హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాపాస్ పుస్తకాల్లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా పొరపాట్లు జరిగితే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, ట్రిబ్యునల్ వరకు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది డిసెంబరు 31న రికార్డుల నవీకరణ చేయబడుతుందన్నారు. ప్రజలకు ఆధార్‌లాగే భూదార్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు శ్వేతారావు, సత్యనారాయణస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, రాష్ట్ర నాయకులు ఎస్‌ఎస్‌ఆర్ సంపత్‌రావు, నాయకులు బోగిరి రాజేష్, ఆకుల మల్లయ్య, కోసరి నరెందర్, శ్రీధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఏటూరు నాగారంలో గుప్త నిధుల తవ్వకాలు?

ఘటనపై విచారణ జరుపుతున్న పోలీసులు



ఏటూరునాగారం ముస్లిం కాలనీలో గుప్త నిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

ఏటూరునాగారం, మే 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ముస్లిం కాలనీలో గుప్త నిధుల తవ్వకాల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొన్ని రోజులుగా మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్, మహమూద్‌లు రాత్రివేళలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది. మండల కేంద్రంలోని ముస్లిం కాలనీకి చెందిన మహ్మద్ అన్వర్ పాషా అనే కారు డ్రైవర్ ఈనెల 2వ తేదీన రాత్రి 10:45 గంటల సమయంలో వారి ఇంటి సమీపంలోని జంపన్నవాగు కరకట్టపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, అదే సమయంలో మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ మహమూద్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు మహ్మద్ అన్వర్ పాషా గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు చూపించేందుకు, దీనిని తన సెల్ ఫోన్‌లో వీడియో, ఫొటోలు తీయడానికి తీశాడు. కాగా, మొదటిసారి తీసిన వీడియో, ఫొటోలు స్పష్టంగా లేకపోవడంతో ఈ నెల 4న మళ్లీ తిరిగి అదే ప్రాంతానికి వెళ్లి వీడియో, ఫొటోలు తీశాడు. ఈ విషయం తెలుసుకున్న అఫ్రోజ్, మహమూద్‌లు అన్వర్‌ను పిలిచి తీవ్రంగా కొట్టారు. దాంతో అన్వర్ పాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

సమన్వయంతో పుష్కరాలను విజయవంతం చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



పుష్కరఘాట్ వద్ద పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, మే 5(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు కాళేశ్వరంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాళేశ్వరంలో వీఐపీఘాట్, సరస్వతి మాత విగ్రహ ఏర్పాట్లు, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాట్ల పనులను సోమవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ నెల 15 నుంచి 26వతేదీ వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుంచి సరస్వతి తల్లి విగ్రహ ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. వీఐపీ ఘాట్ వద్ద తోరణ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమన్వయంతో పుష్కరాలను విజయవంతం చేయాలన్నారు. సరస్వతి ఘాట్ , గోదావరి ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు ఎగ్జిబిషన్, స్టాళ్ల ఏర్పాటు పనులు ప్రారంభించాలని చేశారు. మంచి నీరు, బక్తులు బట్టలు మార్పు గదులు, గోదావరి హారతి పనులు టైంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తాత్కాలిక రహదారి నిర్మాణం జరుగుతుదని, నీళ్ల బుల్డోజర్ ద్వారా చదును చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్‌డ బ్ల్యూఎస్, విద్యుత్, దేవాదాయ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, డీపీవో వీరభద్రయ్య, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఆర్టీసీ డీఎం ఇందు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, దేవాలయ ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదివస్‌లో 16 దరఖాస్తులు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌కు 16 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు వారివారి సమస్యలను ఎస్పీకి విన్నవించారు. బాధితుల సమస్యలను ఓపిగ్గా విన్న ఎస్పీ కిరణ్‌ఖరే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు భరోసా ఇస్తూ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపాలని, అలసత్వం వహించవద్దని ఆయన ఆదేశించారు.

నేతల అండదండలతో ఆదివాసీలపై దాడులు

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై రోజురోజుకు ఆధిపత్య కులాల దాడులు పెరుగుతున్నాయని, నిందితులకు అధికార పార్టీ నాయకులు అండదండగా ఉంటున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలం రాజేందర్ ఆరోపించారు. సోమవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలపై దాడులు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేని ఎడల ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమీషన్లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పసుపు

రికార్డు స్థాయిలో పసుపు ధర

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.13,852
- రేటు ఉన్నా.. పంట సాగు లేదు..

కేసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు ఈ సీజన్‌లో రికార్డు స్థాయి ధర నమోదైంది. సోమవారం మార్కెట్‌కు 26 మంది రైతులు 260 బస్తాల్లో కాడి రకం పసుపు, 23 మంది రైతులు 85 బస్తాల్లో గోల రకం పసుపును విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలో కాడి రకం పసుపు క్వింటాకు గరిష్ఠంగా రూ.13,825, కనిష్ఠంగా రూ.9,569, సగటున రూ.11,459, గోల రకం పసుపు గరిష్ఠంగా రూ.12,051, కనిష్ఠంగా రూ.8,659, సగటున రూ.10,501 చొప్పున ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. 2022లో పసుపు క్వింటాకు రూ.8వేల వరకే ఉండగా 2023లో కాడి రకం పసుపు క్వింటాకు రూ.12వేలు, నిరుడు క్వింటాకు రూ.10వేల వరకు ఉంది. తాజాగా ఈ సీజన్‌లో రూ.13వేలు దాటడం ఓ రికార్డుగా చెప్పవచ్చు.

ధరలేక తగ్గిన సాగు విస్తీర్ణం

గత కొన్నేళ్లుగా పసుపు ధర క్రమంగా తగ్గుతూ వస్తుండడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించుకుంటూ వచ్చారు. ఏళ్ల తరబడి పండిస్తున్న పసుపును ఓ సెంటిమెంట్ పంటగా భావిస్తూ అరకొర విస్తీర్ణంలో కొద్దిమంది రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు గత రెండేళ్లుగా నిత్యం 100 నుంచి 200 బస్తాల కంటే ఎక్కువ పసుపు విక్రయానికి రావడంలేదు. తాజాగా రెండు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ ఉండడంతో 345 బస్తాల పసుపు యార్డుకు వచ్చింది. మార్కెట్‌లో ఇన్ని పసుపు రాశులు కనిపించడం ఈ ఏడాది అరుదైన విషయంగా మారింది. పసుపునకు ధరలు లేకపోవడం, పంట పండించేందుకు అధికంగా శ్రమ ఉండడంతో ఈ పంట సాగును తగ్గించి ఇతర పంటల వైపు రైతులు దృష్టి సారించారు. అనూహ్యంగా ధర పెరగడంతో వచ్చే ఏడాది మళ్లీ పసుపు సాగు చేసేందుకు పలువురు రైతులు మొగ్గుచూపుతూ విత్తన పసుపును నిల్వ పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఏదేమైనా పసుపునకు ధర ఉన్నప్పటికీ రైతుల వద్ద పంట ఉత్పత్తి లేకపోవడం గమనార్హం.

వడదెబ్బతో మహిళా కూలీ మృతి


అక్కి పార్వతి (ఫైల్)

గార్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత నేపథ్యంలో ఓ మహిళా కూలీ వడదెబ్బకు గురై మృతి చెందింది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... అంబేద్కర్ నగర్‌కు చెందిన అక్కి పార్వతి(51) రోజువారీ కూలీ నాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. గత నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాలులకు పార్వతి వడదెబ్బకు గురై అస్వస్థతతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇంట్లోనే తుదిశ్వాస విడిచింది. కాగా, పార్వతికి భర్త అక్కి వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లో రక్తపుటేర్లు పారించకుండా, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మార్కెటింగ్ మంత్రిగా చేసిన సమయంలో మావోయిస్టు నేతలు గద్దర్, శంకర్‌లను అప్పటి సీఎం ఎన్టీఆర్ వద్దకు తీసుకెళ్లి చర్చలు జరపడం జరిగిందన్నారు. కేంద్రం కూడా శాంతిచర్చలు జరపాలన్నారు. కేంద్రానికి శత్రుదేశంతో కాకుండా సొంత ప్రజలపైన దాడులు చేయడం తగదన్నారు. ప్రపంచ సుందరి పోటీలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని నిర్వాహకులే హైదరాబాద్‌ను ఎంపిక చేశారని, పోటీలకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. పోటీలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ఇబ్బందులున్నా రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రూ.35కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్టు కడియం పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్‌తో పథకంతో ఇప్పటికే రూ.10కోట్ల సీసీ రోడ్లు పూర్తి చేశామని, సీఆర్ఆర్ గ్రాంట్ క్రింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14కోట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, చిలుపూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, నాయకులు అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, దూదిపాల నరేందర్ రెడ్డి, జగదీష్‌చందర్ రెడ్డి, లింగాజీ, కొలిపాక సతీష్, గడ్డమీది సురేష్, ప్రసాద్, వెంకటేశ్వర్ రెడ్డి, జీడి రమేష్, రజాక్‌యాదవ్ పాల్గొన్నారు.

పాలనలో అసమర్థతను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు

- కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టును కట్టారు
- మండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద చర్చావేదిక


మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మహదేవపూర్, మే 5(ఆంధ్రజ్యోతి): పదహారు నెలల అసమర్థ పాలనను కప్పి పుచ్చుకొనేందుకు రేవంత్ సర్కారు అనేక ప్రయత్నాలు చేస్తోందని, పాలన చేతకాక అభివృద్ధి చేయలేక తెలంగాణను ఆగం చేస్తున్నారని శాసనమండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు - వాస్తవాలు' అనే అంశాలపై సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను పటా పంచలు చేయాలనే ఆలోచనతో ఈ చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నాడు సమైక్యాంధ్ర పాలనలో వలసవాదులు తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను తరలించుకుపోయి అన్ని రకాలుగా అభివృద్ధి చెంది మన పైనే పెత్తనం చెలాయించారన్నారు. 1956 నుంచి 2014 వరకు అనేక ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమస్యల కాసారంగా తయారైందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ సాధనే సమస్యలకు పరిష్కారమని ఉద్యమ నేత కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో నీళ్లు, నియామకాలు, నిధుల దోపిడీ జరిగిందని, నీళ్ల సమస్యతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని గ్రహించిన కేసీఆర్ ఆ దిశగా అడుగులు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముందుగా నీటి ఉద్యమం మొదలు పెట్టారన్నారు. తెలంగాణ నీటి కోసం పడుతున్న గోస విషయంలో కాకతీయులను ఆదర్శంగా తీసుకున్న కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నీటిని ఒడిసిపట్టే కాకతీయుల ఆలోచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని వివరించారు. పదేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి ప్రయోజనాలు పొందామని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేశారన్నారు. సాగునీటి రంగంలో అపురూపమైన ప్రగతిని చూసిన కాంగ్రెస్ ఆ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డాడని ప్రజలను నమ్మించే కుట్రలు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏజెంట్ అనే విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈ ప్రాంత ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టి ప్రయోజనం పొందేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని బ్యారేజీలు కూలిపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం, ఆలోచన, ఆచరణ అని నీటి పారుదల రంగ నిపుణులు వి.ప్రకాష్‌అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై ఎవరికి అనుమానాలు లేకున్నా ఆయనకు మాత్రం ఉందన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాతనే అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేకపోతే ఇప్పటికి ఎప్పుడో కూలిపోయేదన్నారు. ఆంధ్రాకు నీళ్లు తరలించేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వి.ప్రకాష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పుట్టమధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- పార్టీ కోసం పనిచేసే వారికే పట్టం: ఎంపీ కడియం కావ్య

పాలకుర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి, కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం వరిస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, అమర్ అలీఖాన్, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిలు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. సన్నబియ్యం పంపిణీ, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతానన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని అన్నారు. పాలకుర్తిలో 50 పడకలు, తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కొడకండ్లలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఘనత సాధించాడన్నారు. దేశంలోనే ఓబీసీ కుల గణన జరగాలని రాహుల్ గాంధీ జీవిత లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ అమర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కకు పెట్టి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రబెల్లి స్వర్ణ, భరత్‌చందర్‌రెడ్డి, అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రవళిరెడ్డి, బైకిని లింగం యాదవ్, పొట్ల నాగేశ్వరరావు, మేడి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కావ్య

తెలుగు భాష పరిరక్షణకు ఉద్యమిద్దాం

- విశ్రాంత ఆచార్యులు ఆచార్య బన్న ఐలయ్య, కవి పొట్లపల్లి శ్రీనివాసరావు
- రేపు భాషా నిలయంలో సదస్సు

హనుమకొండ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాతృభాష తెలుగుకు ముప్పు వాటిల్లుతుందని తెలుగు ప్రజలు నివసించే రాష్ట్రంలోనే తల్లి భాషకు ఆదరణ కొరవడడం ఏమాత్రం వాంఛనీయం కాదని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు ప్రముఖ కవి ఆచార్య బన్న ఐలయ్య, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర రాజధానిలో భాషాభిమానులు, కవులతో ఒక సదస్సు జరిగిందని, దానికి కొనసాగింపుగా ఓరుగల్లులోనూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఉద్యమం ప్రారంభించాలన్న యోచన ఉందన్నారు. ఇందుకు ఈ నెల 7న హనుమకొండ లోని 110 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీరాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో భాషా పరిరక్షణ కోసం సదస్సు ఏర్పాటు చేశామని వారు చెబుతూ ఈ సదస్సులో కవులు, రచయితలు, భాషాభిమానులు ప్రతీ ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాలను పరిపాలిస్తు న్న నేతలు భాష విషయంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ తెలుగు భాషను అణగదొక్కే విధంగా వ్యవహరిస్తున్నారని ఆచార్య బన్న చెప్పారు.

ఇటీవల ఇంటర్ విద్యలో ఆప్షన్‌గా సంస్కృతాన్ని మాత్రమే తీసుకోవాలని ఇంటర్ బోర్డు జీవో విడుదల చేయడం పట్ల పొట్లపల్లి శ్రీనివాసరావు అభ్యంతరం చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యలో తెలుగు భాష లేకుండా చేయాలన్నట్లుగా బోర్డు నిర్ణయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా భాషాభిమానులు, విశ్వవిద్యాలయ స్థాయిల్లో కవులు, రచయితలు కూడా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో వరంగల్‌లోనూ ఒక సదస్సు ద్వారా ఐక్యతను ప్రదర్శించి భాషాభిమానాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

అమ్మాయి పుట్టిందని ఆక్రోశం..

- అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు
- పురుగుల మందు తాగి బాలింత ఆత్మహత్య


నిరూష (ఫైల్)

చిట్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిందని, అదనపు కట్నం ఇవ్వాలని అత్తింటి వేధింపులతో ఓ బాలింత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదాకర ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ముచినిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముచినిపర్తి గ్రామానికి చెందిన కత్తికొండ శంకర్ లక్ష్మీరెండవ కుమార్తె నిరూష(26)ను వరంగల్ దేశాయిపేటకు చెందిన మునుగొండ సాంబయ్య లక్ష్మీ దంపతులకు మారుడు ప్రశాంత్‌కు ఇచ్చి గత ఏడాది వివాహం జరిపించారు. కాగా ఇరవై రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో అమ్మాయి పుట్టిందని అదనంగా లక్ష రూపాయలు ఇవ్వాలని నిరూష, ఆమె తల్లితండ్రులపై ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఒత్తిడి చేశారు. ఆదివారం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి నిరూష ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిరూష సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై హేమ తెలిపారు.

టీజీ డీఈఈ సెట్ షెడ్యూల్ విడుదల

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : టీజీ డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. దీని ద్వారా 2025-2027 బ్యాక్‌కు సంబంధించి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ (మైనారిటీ/నాన్ మైనారిటీ) సంస్థల్లో ప్రవేశాలకు ఈ షెడ్యూల్ విడుదలైనట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ అబ్దుల్ హై తెలిపారు. ఈ మేరకు మార్చి 21న నోటిఫికేషన్ విడుదలైందని అర్హులైన అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన ఎడిట్ ఆప్షన్‌ను ఈనెల 17,18 తేదీల్లో తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈనెల 20వ తేదీ నుండి హాల్ టికెట్లు జారీఅవుతాయని తెలిపారు. టీజీ డీఈఈ సెట్- 2025 ఆన్‌లైన్‌లో (కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్) ప్రవేశ పరీక్ష ఈనెల 25న నిర్వహించనున్నట్టు తెలిపారు. కీ పైన అభ్యంతరాలు ఈనెల 28 వరకు స్వీకరిస్తారని చెప్పారు. టీజీ డీఈఈ సెట్-2025 ఫలితాలను జూన్ 5న ప్రకటిస్తారని, అర్హులైన, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జూన్ 7 నుండి 11వ తేదీ వరకు జరుగుతుందని, అనంతరం అర్హులైన అభ్యర్థులందరూ జూన్ 13 నుండి 16వ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని అన్నారు. మెరిట్ ప్రాతిపదికన సంబంధిత కళాశాలలకు జూన్ 20న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో జూన్ 21 నుండి 24 వరకు ఫీజు చెల్లించవచ్చునని, వారికి జులై 1 నుండి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అబ్దుల్ హై కోరారు.

ఉమ్మడి జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా కందగట్ల మోహన్


మోహన్

పోచమ్మమైదాన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన కందగట్ల మోహన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

పెరుగుతున్న పోటీతో ఒత్తిడిలో విద్యార్థులు

- ఇందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్‌పై శిక్షణ శిబిరం ప్రారంభం


బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ శిబిరం ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో రోజు రోజుకు పెరుగుతున్న పోటీ వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారనీ, ఈ ఒత్తిడి నుంచి వారిని బయటపడేయంలో అధ్యాపకులు కీలక భూమిక పోషించాలని వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి పిలుపునిచ్చారు. సోమవారం నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ ఫర్ ఫ్యాకల్టీ రెండు రోజుల శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బిద్యాదర్ సుబుధీ మాట్లాడుతూ అనేక రకాల ఒత్తిడులను విద్యార్థులు అధిగమించేలా చేయడానికి అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా నిట్ అధ్యాపకులకు కనీస స్థాయి కౌన్సెలింగ్ నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి వారు విద్యార్థులకు మద్దతుగా నిలబడేట్టు చేయనున్నామన్నారు. ఇందువల్ల విద్యార్థుల్లో సంక్షోభ పరిస్థితులను అధిగమించగల సామర్థ్యం పెరుగుతుందన్నారు. నిట్ క్యాంపస్‌లో సానుకూల మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని డైరెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్రెషన్ ఇండియా (ఢిల్లీ)కి చెందిన ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్రా, హైదరాబాద్‌కు చెందిన మాజీ డీజీపీ ఆదిత్య అర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ వేణు వినోద్, నిట్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్ ఇంచార్జి ప్రొఫెసర్ జి అంబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో నిట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 200 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యాపకులకు ప్రాథమిక కౌన్సెలింగ్ సాంకేతికతలను ఈ శిబిరంలో నేర్పుతారు. విద్యార్థులలో సాధారణంగా ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, ఇతర మానసిక సమస్యలను ఎదుర్కొనడంలో ఉపయోగపడే ఉత్తమ పద్ధతులు, సాధనాలు, విధానాలపై శిక్షణ ఇస్తారు.

నిట్‌లో పాజిటివ్ మైండ్‌సెట్ కోర్సు

ఈ సందర్భంగా వరంగల్ ఎన్ఐటీ హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌తో ఉన్న అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్, వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులకు సంయుక్తంగా పాజిటివ్ మైండ్‌సెట్ అనే ప్రత్యేక కోర్సును అందించనున్నాయి. ఇది విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని, సమగ్ర వ్యక్తిత్వవికాసానికి దోహదపడుతుంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7410	5300
మక్కలు	2195	1521
కందులు	6650	3022
పెసళ్లు	7601	3022
పల్లికాయ (సూక)	6200	5200
పల్లికాయ (పచ్చిది)	4050	3575
పసుపు (కాడి)	13659	10534
పసుపు (గోల)	11359	9700
తేజ మిర్చి	12000	9500
వండర్‌హాట్	11500	10000
యూఎస్341	11000	9000
దీపిక	10000	9000
దేశీ	-	-
సింగిల్ పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

రామప్ప శిల్పం.. అపురూపం

అబ్బురపరిచే కాకతీయ శిల్పకళా చాతుర్యం


రామప్ప దేవాలయం



వెంకటాపూర్, మే 5, (ఆంధ్రజ్యోతి): కాకతీయ శిల్పకళా చాతుర్యం వర్ణించనలవి కానిది. ఎన్నేళ్లు గడిచినా చూపరులకు కట్టిపడేసే అపురూప సౌందర్యం.. రామప్ప సొంతం. భరతనాట్య శాస్త్రమంతా మూర్తీభవించినట్టుగా, స్తంభాల మీద, పైకప్పుల మీద కనబడుతుంది. రామప్ప గుడిలోని విగ్రహాలు, స్తంభాలపై ఉన్న శిల్పాలు ముఖ్యంగా దేవాలయ మంటపంపై కోణాల్లో నాలుగు పక్కల అమర్చిన పెద్ద నల్లరాతి నాట్యకత్తెల విగ్రహాలు అతి సుందరమైనవి. ఆ విగ్రహాల సొమ్ముల అలంకరణలు, వాటి త్రిభంగీ నాట్యభంగిమలు శిల్పకారులనే సమ్మోహితుల్ని చేస్తున్నాయి. దేవాలయంలోని స్తంభాలపై చెక్కిన నాట్యభంగిమలు, మృదంగాది వాద్యములు, అనేక రకాలైన వాద్యముల రేఖలు చిత్రించి ఉన్నాయి. జాయపసేనాని రచించిన నృత్యరత్నావళిలో ఉదహరించిన నాట్యశిల్పమంతా రామప్ప గుడిలో తొణికిసలాడుతూ, కనువిందు చేస్తూ పర్యాటకుల మనసు దోచుకుంటోంది. ఓ వైపు మదనికలు.. మరోవైపు మనోహర శిల్పాలు రామప్ప ప్రత్యేకత. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఆలయాలన్నిటిలో భిన్నంగా ఇక్కడ ఆనాడే అపురూప సౌందర్యరాశులకు ప్రాణం పోశారు. ఆలయమంతా ఆధ్యాత్మికత పరిమణాలే ఉన్నా.. రంగ మండల స్తంభాలు, దూలాల మధ్యన వెలుపల రెండు వైపులా ఏటవాలుగా కొలువుదీరిన నాగిని, మదనిక శిల్పాలు ఆలయాన్ని విభిన్న కళాకృతుల సమ్మేళనంగా మార్చేశాయి. మరికొద్ది రోజుల్లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడుతున్న పలు దేశాల సుందరీమణులు ఈనెల 14న రామప్పకు రానున్నారు. ఈ నేపథ్యంలో మదనికల విగ్రహాల గురించి..

రూపం కోల్పోని శిల్పం

అందాల 12 మొదటి శిల్పాల్లో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న శిల్పం ఇదే. ఈశిల్పంలో ఉన్న ప్రత్యేకత ఒక కాలి బొటనవేలు మిగతా నాలుగు వేళ్లను వెనక్కి మలిచి నాట్యం చేస్తున్నట్లుగా శిల్పి చెక్కిన తీరు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మొహంలో చిరునవ్వుతో నాట్యం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఒక శిల్పంలో రౌద్రం, ఒకదాంట్లో లాస్యం, మరో శిల్పంలో వేట ఇలా ప్రతి శిల్పానికి ఒక ప్రత్యేకత చూపించి పర్యాటకులను ఆకట్టుకునేలా రామప్ప మదనికలు దర్శనమిస్తున్నాయి.

రౌద్రరూపంలో నాట్య భంగిమ

నవరసాల్లో భాగమే ఈ రౌద్రనాట్య భంగిమ. ఈ భంగిమను పరిశీలించినట్లయితే ఆమె ముఖ కవళికలు కానీ, ఆమె నాట్యం చేస్తున్నప్పుడు ఒకవైపు ఒరిగినప్పుడు పొట్టపై పడుతున్న మడతలు కానీ, కళ్లలో రౌద్రం కానీ, కాలు వంచినప్పుడు మోకాలు చిప్ప కాని శిల్పి చెక్కిన తీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు ఈ భంగిమ.

కోయ స్త్రీ

ఈ మదనిక శిల్పాల్లో అప్పుడున్నటువంటి అడవి చరిత్ర కళ్లకుకట్టినట్లుగా ఈ కోయ స్త్రీ భంగిమ మనకు కనిపిస్తుంది. ఆనాడు అడవి ప్రాంతంలో ఎలా వెళ్లాలి అనే అంశాన్ని ఈ భంగిమ ద్వారా చూపెట్టారు. ఈమె చేతిలో ధనస్సు, కోయ వేషధారణ ఇంకా క్షుణ్ణంగా పరిశీలిస్తే తలపై నెమలిపించం కూడా కనిపిస్తుంది. ఇక్కడ ఈ శిల్పంలో చూపిన అంశం ఏంటంటే ఈమె వేటకు వెళ్లినట్లుగా, వేటకు వెళ్లినప్పుడు ఆమె అరికాలు పాదంలో ముల్లు గుచ్చితే ఆ ముల్లును నూతన సేవకుడు తీస్తున్నట్లుగా చూపెట్టాడు శిల్పి. ఇందులో ప్రత్యేకత ఏమిటని గ్రహిస్తే ముల్లు గుచ్చిన చోట వాపును కూడా చూపెట్టడం శిల్పి గొప్పతనంగా చెప్పవచ్చు. అయితే అన్ని శిల్పాల్లోకల్లా ఈశిల్పం చిన్నదిగా ఉంటుందట.



నాట్య భంగిమ

కాకతీయులకు ఇష్టమైన నాట్యం పేరిణి. అందులో భాగంగానే నాట్యభంగిమను మల్చడం జరిగింది. నాట్యంలో రెండు వేళ్లతో మెడలోని హారాన్ని సపోర్టుగా చేస్తూ నాట్యం చేస్తున్నట్టు చూపెట్టాడు శిల్పి. నాట్య భంగిమపైన మనం గమనించినట్లయితే కుడిచేతి వేలు మొలకలుగాని, గోర్లుగాని మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మనం ఈనాడు అనుకుంటున్న లాంగ్ నెయిల్స్(గోర్లు పెంచుకోవడం) ఆనాడే ఈ శిల్పంలో కనిపిస్తున్నాయి.

ట్రైబల్ లేడీగా శిల్పం నైపుణ్యత

ఇక్కడ కూడా ఒక ట్రైబల్ లేడీగా చూపెట్టాడు. చేతిలో బాణం, పైన చూస్తే అడవిలో ఉన్నట్టు తీగలవలె అల్లినట్లుగా పర్యాటకులకు కనిపిస్తోంది. ఈ శిల్పంలో ఆమె వేటకు వెళ్లి అలసటతో ఓ చెట్టుకింద సేద తీరుతున్నట్టుగా శిల్పి అద్భుతంగా చెక్కాడు. శిల్పంలో గొప్పతనమేంటని పరిశీలిస్తే బొటనవేలికి రెండోవేలికి మధ్యలో ఖాళీ భాగం ఇవ్వడంతోపాటు రెండో వేలికి మట్టలు కూడా కనిపించాయి.

రాగిని

రాగిని కాళ్లకు చూసినట్లయితే ఈనాడు మనం ఫ్యాషన్ అనుకున్న హైహీల్స్ (ఎత్తు మడమల చెప్పులు) 800 సంవత్సరాల క్రితమే మనకు ఇక్కడ దర్శనమిచ్చాయి. ఇప్పటి ఎత్తు మడమల చెప్పులు ఒకవైపు ఎత్తుగా ఉంటాయి కానీ, ఆనాడు రెండువైపులా వెనుక, ముందు ఎత్తుగా ఉన్నాయి. రామప్ప దేవాలయంలో ప్రతీది కూడా నేడు మనం ఫ్యాషన్ అనుకుంటున్న హైహీల్స్ చెప్పులే కానీ పెద్దపెద్ద చెవిదుద్దులు, కొప్పులు, మినీ స్కర్ట్స్ మొదలైనవి పర్యాటకులకు దర్శనమిస్తున్నాయి. ఈ మదనిక శిల్పాల్లో సంస్కృతి, సంప్రదాయాలు మనకు దర్శనమిస్తున్నాయి.

నాగిణి (విషకన్య)..

పాము పడగలపై నాట్యం చేస్తున్నట్లుగా కాళ్లకింద ఒక పాము, పాములనే ఆభరణలుగా, వస్త్రాలుగా ధరించినట్టుగా శిల్పి అద్భుతంగా మలిచాడు. మనం కనుక నిశితంగా పరిశీలిస్తే ఆమె కాలు కింద ఒక పాము కనబడుతుంది. ఆమె ఛాతిభాగంలో ఒకపాము పడగ ఆభరణంగా, ఇంకా ఆమె కాళ్ల కింద భాగంలో తొడలపై ఒక పాము పడగా కనిపిస్తోంది. నాగిణి నాట్యకారిణి శిల్ప అందానికి ముగ్ధుడై ఒక నిజాం ప్రభుత్వ అధికారి సుమారు 100ఏళ్ల క్రితం శిల్పాన్ని తన ఇంట్లో పెట్టుకున్నాడట. పీడకలలు రావడంతో తిరిగి యథాస్థానంలో 17వశతాబ్దంలోనే రామప్పలో పెట్టినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

పాపిట బిళ్లల భంగిమ

ఈనాడు గుజరాత్, రాజస్థాన్ వాళ్లు ఉపయోగిస్తున్న పాపిట బిళ్లల సంస్కృతి ఆనాడే అంటే సుమారు 800ఏళ్లక్రితమే ఈశిల్పంలో కనిపిస్తుంది. శిల్పంలో పాపిటబిళ్లలను పాకెట్లో పెద్ద చక్రంలా కనిపించేలా పర్యాటకులను ఆకర్షించేలా శిల్పి అందంగా చెక్కడంలో ఇది ఒక భాగమే.

సర్కస్ లేడీ, జిమ్నాస్టిక్ నాట్య భంగిమ

ఇప్పుడు ఎలా అయితే పొట్టచేత పట్టుకుని వీధుల వెంట తిరిగే దొమ్మరులు పూట గడిపేందు కోసం సర్కస్ లాంటి ఫీట్లు చేస్తూ పొట్టపోసుకుంటున్నారో ఆనాడే ఇక్కడ ఈశిల్ప భంగిమలో కనిపించేలా చెక్కాడు శిల్పి. ఆభంగిమలో ఇరువైపులా ఒక మనిషి మీద ఒకరు ఎక్కి నాట్యం చేస్తున్నట్లుగా మధ్యలో కర్రసాము చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పుడు జిమ్నాస్టిక్, కర్రసాము అని ఎలా అనుకుంటున్నామో 800ఏళ్లక్రితమే ఇక్కడ కనిపిస్తుంది.


ఇటీవల రామప్పను సందర్శించిన మిస్ ఇండియా నందిని గుప్తా

రాతి నుంచి నీడ

12 మొదటి శిల్పాల్లో ఈశిల్పంలో ఒక అద్భుతమైన ఆకర్షణ కనిపిస్తుంది. పర్యాటకులు ఈ శిల్పాన్ని చూస్తూ సూర్యరశ్మి వల్ల ఈశిల్పం హారంనీడ అనేది కనిపిస్తుంది అనుకుంటే పొరపాటే. ఎందుకంటే హారం నీడ అనేది ఆ శిల్పి చెక్కిన పనితీరుకు నిదర్శనం. ఆమె మెడలో ధరించిన హారం నీడ తన పొట్టపై పడుతున్నట్లుగా కనిపించడం ఈభంగిమ ప్రత్యేకత. సూర్యోదయం మొదలుకుని సూర్యాస్తమయం వరకు ఈ నీడ ఇలానే కనిపిస్తుంది.

కోతి చిలిపి చేష్టలు

12మదనిక శిల్పాల్లో కొద్దిగా పెద్దదిగా కనిపిస్తుంది. శిల్పి కోతి యొక్క చిలిపి చేష్టలను ఇక్కడ చూపెట్టడం జరిగింది. కోతి అక్కడ ఉన్న మదనిక శిల్పం యొక్క చీరను లాగుతున్నట్లుగా చూపెట్టాడు. ఒకచేతిలో తన మానాన్ని కాపాడు కుంటూ మరో చేతితో కోతిని కొడుతున్నట్లుగా శిల్పంలో కనిపిస్తుంది. కోతిని కొట్టేటప్పుడు కూడా తన కళ్లల్లో రౌద్రం కనిపించేలా శిల్పి చెక్కిన తీరు పర్యాటకులకు ఔరా అనిపిస్తుంది.

సాధారణ నృత్యం

పేరిణి నృత్య భంగిమల్లో ఒకటైన సాధారణ భంగిమ ఆకారంలో కనిపిస్తుంది. ఈశిల్పంలో ఎలాంటి ఆహాభావాలు లేకుండా ఒక సాధారణ లేడీలా నాట్యం చేస్తుందో అలా మనకు దర్శనమివ్వడం ఈశిల్పంలోని ప్రత్యేక ఆకర్షణ.


రామప్ప ఆలయంలోని మదనిక శిల్పాలు

నాడు కీకారణ్యం.. నేడు రమణీయ పర్వం

కాళేశ్వరం చరిత్రకు కాలమే సాక్షి

మహదేవపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : త్రేతా యుగంలో దండకారణ్యంలో రాముడు సంచరించి ముక్తీశ్వరుడిని పూజించిన రామక్షేత్రం కాళేశ్వరం. ఆనాటి నుంచి దట్టమైన అడవులతో రాకపోకలు లేని సమయంలో వణ్యప్రాణుల భయంతో ఘోర అరణ్యంగా ఉన్న కాళేశ్వరంలో తినడానికి తిండి లేని పరిస్థితుల్లో క్షేత్రవాసులు అనేక ఇబ్బందులు పడి హైదరాబాద్, ముంబై, పుణె, నాగపూర్ తదితర పట్టణ ప్రాంతాలకు జీవనోపాధి కోసం ప్రవాసం వెళ్లారు. దానికి సాక్ష్యంగా గ్రామస్థులు 'కాళేశ్వరం మహాక్షేత్రం.. కట్టె పిడక సురక్షితం. అన్న వస్త్రం ద్వయం నాస్తి.. శీఘ్రమే శివ దర్శనం..' అని ఒక శ్లోకం చెప్పేవారు. దీని అర్థం ఏంటంటే.. పూర్వం కట్టుకోవడానికి దుస్తులు, తినడానికి తిండి లేని క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయట. క్షామం వచ్చినప్పుడు గౌతమ మహర్షి ఇక్కడ దేశ ప్రజలకు అన్నదానం చేశాడని గోదావరి చరిత్ర చెబుతోంది. గోహత్యా పాతకాన్ని పోగొట్టుకోవడానికి గౌతమ ముని కోసం కాళేశ్వరం వరకు వచ్చింది గోదావరి. నాడు బాధలో ఉన్న వారికి తిండి పెట్టిన ప్రాంతమే ఘోర అరణ్యంగా మారి తిండి బట్ట లభించని పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా కొన్ని శతాబ్దాలు గడిచాయి. ఆ తర్వాత కాళేశ్వరానికి మహర్దశ వచ్చింది. 1965లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావు ఈ ప్రాంతంలో మంథని నియోజక వర్గం నుంచి మూడు సార్లు గెలిచి కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ చేయడానికి నిశ్చయించుకున్నారు. దానికి యోజనాలు తయారు చేశారు. కానీ అనివార్య కారణాలు, వ్యక్తిగత విషయాల వల్ల ఆయన చేలేకపోయారు. అదే ప్రణాళికను జగద్గురు ఆదేశానుసారం అప్పటి రాష్ట్ర మంత్రి జువ్వాడి చొక్కారావు 1976 మార్చి నెలలో కాళేశ్వరం వచ్చి ఈ క్షేత్ర పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నారు. మొదటగా రెండు బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. ముఖ్య ఆలయంలో మహన్యాస పూర్వకంగా ప్రతిరోజు ఏకాదశ రుద్రాభిషేకం జరిగే విధంగా పండితులను నియమించారు. ఆంధ్రపత్రిక ద్వారా చందాలు వసూలు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అప్పుడు కాళేశ్వరంలో వివిధ దేవాలయాలు ఉండేవి. బిందు మాధవ స్వామి బాల రాజేశ్వరస్వామి కాశీ విశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ, సదాపూర్ణ, సరస్వతి, సావిత్రి, గాయత్రి, బ్రహ్మ దేవాలయం, వేంకటేశ్వరాలయం, రామాలయం, సంగమేశ్వరాలయం, వీరభద్రాలయం, జయ విజయులు, సూర్యనారాయణమూర్తి దేవాలయాలు, అహల్య గౌతముడు, సనకసనందన, సనత్కుమారులు, నారదుడు, కాల భైరవుడు, నీలకంఠేశ్వరుడు, సురభాండేశ్వరుడు, రాతి ధ్వజస్తంభం, దానిపైన నంది, దేవాలయానికి కిలోమీటరు దూరంలో ఆది ముక్తీశ్వర, మధ్య ముక్తీశ్వర, వీరంజనేయ, చంద్రశేఖర, సోమశేఖర, నర్సింహేశ్వర దేవాలయాలు ఉండేవి. ముందు భేరిశాల అనే ప్రవేశ ద్వారం ఉండేది. ఆ భేరీశాలలో సుమారు 20 శిలా


అనాటి కాళేశ్వరాలయం

శాసనాలు రాసి ఉండేవి. జీర్ణోద్ధరణ సమయంలో అవి అంతరించిపోయాయి.

అభివృద్ధి మొదలైందిలా..

చొక్కారావుతో పాటు ఆంధ్రప్రత్రిక సంపాదకులు వివిధ ఆధ్యాత్మిక వేత్తలు పీవీ నరసింహారావు మొదలైన నాయకులు, నటరాజన్, జీపీ రావు, కే ఎస్ శర్మ, కమలేశ్వర్‌రావు, కలెక్టర్లు జీర్ణోద్ధారణ కోసం కాళేశ్వరం వచ్చి అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. మొదటగా విజయగణపతి దేవాలయానికి శిలా స్థాపన చేయించి విజయగణపతి దేవాలయాన్ని నిర్మించి డిసెంబరు 1976లో అభినవ విద్యా తీర్థ స్వామి, భారతి తీర్థ స్వామి, జగద్గురు శంకాచార్యులు వచ్చి కరకములతో ప్రతిష్ఠలు జరిపించారు. ఆ తర్వాత జీర్ణమైన దేవాలయాలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టారు. 1980 నుంచి 1981లో మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించారు. వివిధ ప్రాంతల నుంచి అనేక బస్సులు వేయించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. 1982లో ఫిబ్రవరి 9వ తేదీన శృంగేరి జగద్గురు విద్యాతీర్థ స్వామి భారతీ తీర్థ స్వామి చేతుల మీదుగా రాజగోపురం, విమాన గోపురంపై కలశస్థాపన ప్రతిష్ఠలు, మహా కుంభాబిషేకాలు నిర్వహించారు. అప్పటి నుంచి అభివృద్ధి ప్రవర్ధమానమై సంపూర్ణమైన రమణీయ దర్శనీయ స్థలంగా విరాజిల్లుతోంది. అభివృద్ధిలో భాగంగా ఉమ్మడి ఏపీ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు క్షేత్ర అభివృద్ధిలో పాలు పంచుకున్నారు. కాళేశ్వరంలో ఆది ముక్తేశ్వరాలయం, సంగమేశ్వరాలయం, దత్తాత్రేయాలయం తదితర ఆయన చేతుల మీదుగా జరిగాయి. ప్రతిష్ఠాపన జరిగింది. ప్రస్తుతం శ్రీపాద రావు కుమారుడు ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాలంలో దేవాలయంలో అభివృద్ధి పనులు సాధించారు. గతంలో వేములవాడ, తిరుపతి దేవస్థానం కట్టించిన గదులు మాత్రమే ఉండగా ఇంకా ఎన్నో వసతి సౌకర్యాలు కల్పించారు. హోమ మండపం, వంటశాల ప్రసాదాల వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ఇలా పరిపూర్ణమైన అభివృద్ధి పనులను చేయించడమే కాకుండా ఇప్పుడు ప్రస్తుతం రూ.25కోట్లతో ఆలయ ప్రాంతం చుట్టూ అబివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్రివేణి సంగమం వద్ద సరస్వతీ మాత విగ్రహంతో పాటు పుణ్య స్నాన ఘట్టాలు, పుష్కర ఘాట్లు, పలు అబివృద్ధిపనులు జరుగుతున్నాయి.

మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, ఒడిస్సా, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ నుంచి లక్షలాది భక్తులు విచ్చేసి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. నాడు విలువ లేని భూములకు నేడు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఆనాటి గుడిసెలు నేడు భవంతు లుగా మారాయి. గతంలో ఉపాధి కోసం వలస వెళ్లిన వారంతా తిరిగి కాళేశ్వరం చేరుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. హైదరాబాద్ లో గజానికి రూ.35వేలు పలుకుతుండగా కాళేశ్వరంలో గజం రూ.70 వేలు పలకడం విశేషం.

ఆరు సరస్వతీ పుష్కరాలు చూశా : సుశీలమ్మ



నా వయస్సు తొంభై సంవత్సరలు, మా ఊరు కాళేశ్వరం. మా దగ్గర మూడు నదులు ప్రాణహిత, గోదావరి, సరస్వతి కలుస్తాయి. సంగమ తీర్థంలో స్నానం చేస్తే పుణ్యం. అన్ని నదులకు 12ఏళ్ల కోసారి పుష్కరాలు వస్తే.. మా దగ్గర మూడు సార్లు వస్తాయి. ఇప్పటి వరకు ఆరు సార్లు సరస్వతి పుష్కరాలు చూశా. నాకు తొమ్మిదేండ్ల నాడే పెండ్లయింది. మా అత్తగారు చెన్నూరు. నా భర్త 57 ఏళ్ల క్రితమే పోయాడు. అప్పటిదాక పండుగలకు, మంచి రోజుల్లో ఉత్తర వాహిని గోదావరిలో స్నానం చేసేవాళ్లం. తర్వాత కాళేశ్వరంలో ప్రతీ రోజు గంగా స్నానం చేసి లింగ దర్శనం చేసుకోవడం అలవాటు. 2023లో అనారోగ్యం బారిన పడ్డా. ఇప్పుడు చేతగావట్లే. అయినా పండుగలకు గంగకు పోయి స్నానం చేస్త. మా చిన్నప్పుడు బస్సులు, కరెంటు లేకుండే. ఎడ్లబండ్ల మీద యాత్రికులు వచ్చేవారు. ఒక్కో నదికి ఆరేసి పుష్కరాల్లో మొత్తం పద్దెనిమిది పుష్కరాల్లో నదీ స్నానం చేశా. 2022 ప్రాణహిత పుష్కరాల్లో అర్జున్ గట్టు దగ్గర స్నానం చేశా.


మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం

- 50ఎకరాల విస్తీర్ణంలో 15ఏళ్ల క్రితం ఏర్పాటు
- జోనల్ స్థాయిలో ఏడు సార్లు ప్రశంస పత్రాలు
- ఏటా 85కు పైగా శిక్షణ శిబిరాలు
- మెళకువలు నేర్చిన రైతులకు జాతీయ స్థాయిలో అవార్డులు

కృషి విజ్ఞాన కేంద్రం.. రైతుల నేస్తం

ఎన్నో శిక్షణలు మరెన్నో అవగాహన సదస్సులు

మామునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆధునికతను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ.. సాగుబడిలో అధిక దిగుబడిని సాధించేలా.. రైతులకు సరైన సలహాలు, సూచనలే కాదు సేవలను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే).. అన్నదాతలకు నేస్తంగా నిలుస్తోంది వరంగల్ కృషి విజ్ఞాన కేంద్రం. 15 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ కేవీకే ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులకు వివిధ పంటలపై శిక్షణ తరగతులు, ఆధునిక వ్యవసాయ రంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కేంద్రం ద్వారా మెళకువలు నేర్చుకున్న రైతులు జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకోగా.. పలువురు శాస్త్రవేత్తలు ప్రశంసలు అందుకున్నారు.

50ఎకరాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు..

వరంగల్ మామునూరులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం 50ఎకరాల స్థలాన్ని కేటాయించి అందులో 2010లో కృషి విజ్ఞాన కేంద్ర భవనం నిర్మించారు. దాంతో పాటు రైతు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. భారత పరిశోధన మండలి (ఐసీఏర్) ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకువిశేష సేవలందిస్తోంది. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ వాతావరణం పద్ధతులు, చీడపీడలు, నివారణ, నూతన యాజమాన్య పద్ధతులను వివరించడం లాంటవి శాస్త్రవేత్తలు చేస్తున్నారు. సంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి కొత్త పరిశోధనలను రైతులకు చేరువ చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో సాంకేతిక అభివృద్ధితో రైతులు ముందుకు నడిచేందుకు అండగా నిలుస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, మేలు జాతి పశువులు, వంగడాల ఏర్పాటు, చేపపిల్లల పెంపకం, పూలసాగు, తీగజాతి కురగాయల సాగుకు శాశ్వత పందిర్ల ఏర్పాట్లు, భూమిలో నత్రజని శాతంపై పరిశోధన చేస్తున్నారు. వ్యవసాయ పని అనుభవ శిక్షణలో భాగంగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులను సేంద్రియ సాగుదిశగా మళ్లించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక దత్తత గ్రామాలను ఏర్పాటు చేసుకొని రైతులకు సాగు సేవలందిస్తున్నారు. పలు విభాగాల్లో ఏడుగురు శాస్త్రవేత్తలు విధులు నిర్వహిస్తున్నారు.


జాతీయ అవార్డు అందుకుంటున్న ఉత్తమ రైతు

కేవికేను సద్వినియోగం చేసుకోవాలి



కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీని ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 15వేల మంది రైతులకు పైగా శిక్షణలు ఇచ్చాం.వారి సందేహాలను నివృత్తి చేసేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తున్నాం. రైతులు వ్యవసాయ రంగంలో నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

- డా.రాజన్న, కేవికే కోఆర్డినేటర్

కృషి విజ్ఞాన కేంద్రంలో ఎంతో నేర్చుకున్న



కేవీకే శాస్త్రవేత్తలు మాకు చాలా బాగా శిక్షణలు ఇచ్చారు. కృషి విజ్ఞానం కేంద్రం ద్వారా చాలా నేర్చుకున్నాం. సేంద్రియ పంటలతో పాటు చేపలు, కోళ్ల పెంపకం చేస్తున్నా. మంచి లభాలను పొందుతున్నా.


- యాకాంబరం, సింగారం

సుగంధ ద్రవ్యాల పంటలపై మక్కువ



సుగంధ ద్రవ్యాలపై శిక్షణలు ఇవ్వడమే కాక గ్రామాల్లో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. దాదాపు 100 మంది రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని, ఉద్యానపంటలను సాగు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వారు వాటర్ ప్లాంట్ అందజేశారు.

- వెంకన్న, జయరాం తండా,వరంగల్



నాటు సారా పట్టివేత



పట్టుకున్న నిందితుడితో ఎస్సై రాజ్‌కుమార్

వాజేడు, మే 5(ఆంధ్రజ్యోతి): గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిపై వాజేడు పోలీ సులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజ్‌కు మార్ తెలిపిన వివరాల ప్రకారం సోమ వారం మండలంలోని గుమ్మడిదొడ్డి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పోలీ సులను చూసి బైక్‌పై వస్తున్న వ్యక్తి పారి పోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద 20 లీటర్ల గుడుంబాను గుర్తించి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు, పట్టుబడి వ్యక్తి మండలంలోని గుమ్మడిదొడ్డి అని, బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మార్క్సిజమే మహోన్నత సిద్ధాంతం

గోవిందరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): మార్క్సిజమే మహోన్నత మానవతా సిద్ధాంతమని, ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మార్క్సిజం పరిష్కారం చూపుతుందని సీపీఎంపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం కారల్‌మార్క్స్ జయంతి కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు రత్నం రాజేందర్, పొదిళ్ల చిట్టిబాబు, రఘుపతి, వాసు, మ ల్లారెడ్డి, ఆగిరెడ్డి, గఫూర్‌పాషా, సౌమ్య, చిన్న, దేవయ్య, కృష్ణబాబు, దామోదర్,రాజేష్, చిరంజీవి, చారి, తదితరులు పాల్గొన్నారు.



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు

● కృష్ణకాలనీ : ప్రపంచ మేధావి కారల్‌మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో కారల్‌మార్క్స్ 207వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మా ట్లాడు తూ మార్క్స్ 1818 మే 5న జర్మనిలో జన్మిం చి అనేక ఇబ్బందులు ఎదుర్కొని ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థను ఏ విధంగా ఎదురుకోవాలని, శ్రామిక కార్మిక వర్గానికి ఏ విధంగా కాపాడుకోవాలని మార్క్స్ సిద్ధాంతం ద్వారా ప్రపంచానికి అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మార్క్స్ సిద్ధాంతం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, కొరిమి సుగుణ, నేరేళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, పొనగంటి లావణ్య, భీమనాథుడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో మానసిక ప్రశాంతత

కృష్ణకాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): భక్తి భావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని భూపాలపల్లి ఎస్సై రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో గల ఓసీ-2 సమీపంలో దుర్గా దేవీ ఆలయంలో నిర్వహించిన హనుమాన్ దీక్షా పరుల అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు హనుమా న్‌దీక్షా పరులకు భిక్ష స్వయంగా వడ్డించారు. ఆలయానికి వచ్చిన ఎస్సైకి ఆలయ అర్చకులు ముప్పిడోజు లక్ష్మణాచారి, ముప్పిడోజు భరత్‌లు స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా దాతలు రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత మృతి

రేగొండ, మే 5(ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో సోమవారం ఉదయం కాంగ్రెస్‌పార్టీ రేగొండ గ్రామశాఖ అద్యక్షుడు బొల్లపల్లి చంద్రమౌళి(50) మృతించెందాడు. కాగా చంద్రమౌళి భౌతిక కాయంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కాంగ్రెస్ జెండాను కప్పి పులమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ అద్యక్షుడిగా మూడు దఫాలుగా పని చేసిన చంద్రమౌళి సేవలు మరవలేనివని అన్నారు. పరామర్శించిన వారిలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగపురి రాజమౌళిగౌడ్, బీజేపీ జిల్లా అద్యక్షుడు నిశీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సన్న, ఎడ్ల మల్లారెడ్డి, మేకల భిక్షపతి, ధామస్, మైన భిక్షపతి, పున్నం రవి, పట్టెం శంకర్, వీరబ్రహ్మం, గండి తిరుపతిగౌడ్‌లు ఉన్నారు.

అటకెక్కిన చలివేంద్రాలు

వెంకటాపూర్, మే 5, (ఆంధ్రజ్యోతి):వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చటానికి గ్రామ పంచాయితీల ఆద్వర్యంలో వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో చలి వేంద్రాలను ప్రారంభించారు. కాని నెల రోజులు గడవక ముందే అటకెక్కించారు. చలి వేంద్రాల్లో నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన ఒక్క వస్తువు కూడా లేకుండా పోయాయి. అధికారులు అట్టహసంగా ప్రారంభించారు. కాని నిర్వహణ మరిచారు. అధికారులకు కమీషన్లు వచ్చే పనులు మాత్రం దగ్గరుండి పట్టించుకోని చేపడుతారు కనీసం ఈనెలాఖరు వరకు చలి వేంద్రాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే నీటిని అందిస్తాం : ఈఈ

వెంకటాపూర్, మే 4, (ఆంధ్రజ్యోతి): పాలంపేట గ్రామ పంచాయితీ పరిధిలోని ఎస్సీ కాలనీకి త్వరలోనే మంచినీటి సౌకర్యం కల్పిస్తామని మిషన్ భగీరథ ఈఈ తెలిపారు. ఎస్సీ కాలనీ నీటి సరఫరాపై ఆంధ్రజ్యోతి పాలంపేట ఎస్సీ కాలనీలో నీటి ఇబ్బందులు అనే కథనాన్ని సోమవారం ప్రచురించింది. స్పందించిన మిషన్ భగీరథ ఈఈ ఈఈ మాణిక్యరావు ఈప్రకటన విడుదల చేశారు. ఎస్సీ కాలనీలో పైపులైనుకు డ్యామెజ్ జరిగిందని తెలిపారు. త్వరలోనే మరమ్మతులు జరిపిస్తామని పేర్కొన్నారు. అప్పటి వరకు ట్యాకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. సమస్య పరిష్కరిస్తామన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ఘన సన్మానం

గోవిందరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని బెజ్జరబోయిన స్రవంతి, మెరుగు నాగచరణ్‌లు పదోతరగతి వార్షిక ఫలితాల్లో పాఠశాలస్థాయిలో మొదటి, రెండో ర్యాంకు సాధించగా కాకతీయ వాకర్ క్లబ్ ఆద్వర్యంలో సోమవారం ఘన సన్మానం జరిగింది. ఈసందర్భంగా వాకర్‌క్లబ్ అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు సూడి శ్రీనివాసరెడ్డిలు మొదటి ర్యాంకు సాధించిన స్రవంతికి రూ.8వేలు, రెండో ర్యాంకు సాధించిన మెరుగు నాగచరణ్‌కు రూ.5వేల నగదు బహుమతి అందించి శాలువాలతో సన్మానించారు. వాకర్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి భూక్య బాబూరావు, 60మంది వాకర్స్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

వెంకటాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏటూరునాగారం ఏడీఏ అవినాష్‌వర్మ అన్నారు. సోమవారం మండలంలోని పాత్రాపురం రైతువేదికలో ఎరువులు, పురుగుమందుషాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మహితాపురంలో రైతులకు విత్తన కొనుగోలుపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసమావేశంలో మండల వ్యవసాయ అధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

సివిల్ కాంట్రాక్టర్ అదృశ్యం.. కేసు నమోదు

కాటారం, మే 5 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో అద్దెకు ఉంటున్న కనవేన తిరుపతి(36) అనే సివిల్ కాంట్రాక్టర్ గత రెండు రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై గీతారాథోడ్ సోమవారం తెలిపారు. పీఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..పెద్దపల్లి జిల్లా మంథని మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన తిరుపతి గత కొన్నేళ్లుగా కాటారం మండల కేంద్రంలో ఉంటూ సబ్ డివిజన్‌లో ప్రాంతంలో చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న ఉదయం తిరుపతి ఇంటి నుంచి కలెక్టరేట్‌కు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటి నుంచి బైక్‌పై బయటికి వెళ్లిన గంట సేపటి అనంతరం భార్య మమత ఫోన్ చేయగా భూపాలపల్లిలోనే ఉన్నానని, గంట తర్వాత వస్తానని చెప్పాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయింది. దీంతో ఆదివారం రాత్రి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పీఎస్సై తెలిపారు.

చెరువులను కబ్జా చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):చెరువు శిఖం భూములను కబ్జా చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని, కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం శ్రీకాంత్ పలువురు ప్రజా సంఘాల నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెరువుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చెరువుల కబ్జాను అరికట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన బ్రహ్మోత్సవాల వేలం పాటలు

మంగపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు 10 రోజుల పాటు వైభవంగా జరుగుతున్న దృష్ట్యా భక్తులకు వివిధ రకాల సరుకులు వస్తువులు విక్రయించడానికి బహిరంగ వేలం పాటలను దేవదాయ, ధర్మదాయశాఖ నిర్వహించింది. రెండుసార్లు వాయిదా పడిన వేలం పాటలు సోమవారం పూర్తయ్యాయి. దేవస్థానం ఈవో సత్యనారాయణ అద్వర్యంలో వేలం పాటలు జరుగగా జగిత్యాల జిల్లాకు చెందిన ప్రసాదుల రాంబాబు తలనీలాల టెండర్ 2.17 లక్షలకు చేజిక్కించుకున్నారు. గత ఏడాది 3.21 లక్షలు పలకడం గమనార్హం. లడ్డూ పులిహోర ప్రసాదం టెండర్ మామిడిగూడెంకు చెందిన బారబోయిన గోవర్ధన్ రూ 2.10 లక్షలకు దక్కించుకున్నాడు. దీంతో జాతర వేలం పాటలు పూర్తయ్యాయని ఈ.వో సత్యనారాయణ వెల్లడించారు. ఈ చివరి రోజు వేలం పాటలలో ఆలయ అర్చకులు పవన్‌కుమారచార్యులు, వెంకటనారాయణశర్మలతో పాటు ఉద్యోగులు సీతారాములు, లక్ష్మీనారాయణ తాత్కాలిక ఉద్యోగులు వ్యాపారులు గ్రామ ప్రముఖులు ఆదివాసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్‌డీఎస్‌ఎస్ చేయూత

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపల్లి తండాకు చెందిన అజ్మీరా జైపాల్ అనే కౌలురైతు అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడగా ఆ కుటుంబానికి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ, రైతు స్వరాజ్యవేదిక నిర్వహకులు చేయూతనందించారు. సోమవారం జైపాల్ కుటుంబసభ్యులకు ఆర్‌డీఎస్ఎస్ నిర్వాహకులు రూ. 40వేల విలువ చేసే రెండు పాడి గేదెలను అందజేశారు. వీటిని రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య జైపాల్ కుటుంబసభ్యులకు అప్పగించారు. రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ ద్వారా నివేదికలను తెప్పించుకుని ప్రభుత్వం ఆ కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు బీ కొండాల్‌రెడ్డి, ముక్క ఐలయ్య, జిల్లా కో కన్వీనర్ చల్లగురుగుల సంజీవ్ తదితరులు ఉన్నారు.

వెంకటాపూర్ కస్తూర్బాలో సమ్మర్ క్యాంపు



ఉచిత క్యాంపును ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపూర్, మే 5, (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయాల విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈక్యాంపులు ప్రారంభమై మే 20వ తేదీ వరకు 15 రోజుల పాటు కొనసాగనున్నాయి. ములుగు జిల్లాలో 9 కేజీవీబీలు ఉండగా 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు వీరందరికీ ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ గ్రామంలోని కేజీవీబీలో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్క క్యాంపులో 100 మంది విద్యార్థులకు అవకాశం ఇవ్వనున్నారు. ఎనమిది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. మ్యాజిక్, డ్యాన్స్, పేయింటింగ్, కంప్యూటర్ స్కిల్స్ స్పీడ్ మ్యాథ్స్ క్రీడలు, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. డాన్స్‌కు నరసింహ, గేమ్స్‌కు పీఈటీ సూజాత, యోగాకు హరిత, స్పోకేన్ ఇంగ్లీష్‌కు రాజశేఖర్, స్పీడ్ మ్యాస్‌కు నిరంజన్‌రెడ్డి, కంప్యూటర్‌కు నల్ల స్వాతి,లు వ్యవహరించనున్నారు. క్యాంపు కో ఆర్డినేటర్లుగా జవహర్‌గర్ ఎస్‌వో వసంత లక్ష్మీ, ములుగు ఎస్‌వో జీవనప్రియలను ప్రత్యేక అధికారులను విద్యాశాఖ నియమించింది.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఆలస్యంగా పనులు

భూపాలపల్లిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం మూలంగా కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల పనులు నత్తనడకన సాగుతున్నాయని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆరోపించారు. సోమవారం ఆయన కాళేశ్వరంకు వెళ్లి పుష్కరాల పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరుచేస్తే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. కనీసం 30శాతం కూడా పూర్తి కాలేదని విమర్శలు చేశారు. వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపించి పనులు వేగవంతం చేయడమే కాకుండా పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పోశయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలి



విద్యార్థిని కారుణ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని గోవిందరావుపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు కాటం మల్లారెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల చైర్మన్ తేళ్ల హరిత, ఎంఈవో గొంది దివాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, శ్రీనివాసరావు, రమణమూర్తి, చాప బాబు, అన్నపూర్ణ, శ్రీదేవి, స్వాతి, అవంతిక, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌కు ఇంపాక్ట్ ఫౌండేషన్ గుర్తింపు



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న చంద్రమౌళి

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న వేల్పుల చంద్రమౌళి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుంచి సర్టిఫైడ్ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్‌గా గుర్తింపుపొందా రు. సికింద్రాబాద్‌లో గత 2 రోజుల పాటు జరిగిన 'ట్రైన్ ద ట్రైనర్ వర్క్‌షాప్' శిక్షణా కార్యక్రమంలో చంద్రమౌళి విజయవంతంగా పాస్ కావడంతో మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ సర్టిఫికెట్‌ను ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అందించారు. జ్ఞానం, నైపుణ్యం, సానుకూల దృక్పథం ద్వారా విద్యార్థులు, యువ తను ప్రేరేపించేలా శిక్షణనివ్వాలని చంద్రమౌళిని కోరారు.

మండలంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు

వెంకటాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్ భద్రత వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడీఏ అకిటి స్వామి రైతులు, విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యుత్ మరమ్మతులు, లైన్ మరమ్మతుల సమయంలో విద్యుత్ సిబ్బంది పాటించాల్సిన జాగ్రత్తలు, నియమనిబంధనలపై వివరించారు. రైతులు విద్యుత్ మోటార్ల వినియోగం, లైన్ మరమ్మతులు, సమస్యలు ఏర్పడితే విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసి పరిష్కరించు కోవాలన్నారు. ఈనెల 1నుంచి 7వతేదీ వరకు జరిగే విద్యుత్ భద్రతా వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈ హనుమాన్, సబ్ ఇంజనీర్ సూర్యప్రకాశ్, సిబ్బంది ఫరీద్‌పాషా, దిలీప్, వీరస్వామి పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను ఆశాఖ సిబ్బంది నిర్వహిస్తున్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఏడీఏ ఆకిటి స్వామిరెడ్డి విద్యుత్ కార్మికులకు, స్థానిక రైతులకు విద్యుత్ వినియోగం పై



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

అవగాహన కల్పించారు. విద్యుత్ లైను మరమ్మత్తులు, నియంత్రికల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్ద మోటార్లు, నియంత్రికల వద్ద ఏమైనా లోపాలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అర్షద్ అహ్మద్, సబ్ ఇంజనీరు నగేష్‌కుమార్, సిబ్బంది యాకూబ్ పాషా, వెంకటేశ్వర్లు, రమేష్, సురేష్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ములుగులో పాకిస్థానీలు ఉంటే వెంటనే బహిష్కరించాలి

ములుగు, మే 5, (ఆంధ్రజ్యోతి):ములుగు జిల్లా వ్యాప్తంగా అక్రమంగా పాకిస్థానీ జాతీయులు ఉంటే కనిపెట్టి వెంటనే బహిష్కరించాలని ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరికొండ బలరాం సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ మద్దతుతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు గత నెల ఏప్రిల్ 22న కాశ్మీర్‌లో పహల్గాం ప్రాంతంలో క్రూరమైన దాడికి పాల్పడటంతో 26 మంది అమాయక పౌరుల ప్రాణాలను బలిగొన్న విషయం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ములుగులో పాకిస్థానీలు ఉంటే వెంటనే వారిని గుర్తించి భారతదేశం నుంచి పంపించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భూక్య జవహర్, ఎస్టీమోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా నాయకులు దింతిరెడ్డి రవి, గాదం కుమార్, దండిగా వెంకన్న, ఎల్కతుర్తి శ్రీహరి పాల్గొన్నారు.

మల్లూరు బ్రహ్మోత్సవాలకు అదనపు బస్సులు

ములుగు, మే 5(ఆంధ్రజ్యోతి): మల్లూరు లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కోసం ఏటూరునాగారం నుంచి ప్రతీ 20 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉంటుందని వరంగల్ -2 డిపో మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం ఇప్పటికే ప్రతీ 40 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉంచామని, ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న నాగవెల్లి కార్యక్రమం కోసం బస్సుల సంఖ్యను పెంచి ఉదయం 7 గంటల నుంచి 20 నిమిషాల వరకు ఒక బస్సును అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

గొత్తికోయలకు నిత్యావసర సరుకుల అందజేత

తాడ్వాయి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్వాయి గ్రామ పంచాయితీ పరిధిలోని మండలతోగు గుంపులో గొత్తికోయలకు చక్రవర్తి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ తరుణ్ కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గూడెంలోని 30కుటుంబాలకు నిత్యవసర సరుకులు 25కేజీల బియ్యం, పప్పులు, నూనె, ఉల్లిగడ్డ, ఇతర కిరాణ సామాన్లు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరిక్షలు నిర్వహించారు. పలువురికి మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో వారి హాస్పిటల్ వైద్య సిబ్బంది, పోలీసులు, గొత్తికోయలు తదితరలు పాల్గొన్నారు.

మృతి చెందిన యువతి కుటుంబానికి పరామర్శ

తాడ్వాయి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపూర్ గ్రామానికి చెందిన తెల్లం ప్రియాంక(21) అనే యువతి ఆదివారం ఉరివేసుకొని మృతి చెందిన విషయం తెలిసిందే కాగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పార్టీ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబాన్ని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ముందుగా మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):33/11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మల్హర్ మండలాల్లో మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటారం ఏడీఈ నాగరాజు తెలిపారు. ధన్వాడ, గంగారం, దామెరకుంట, కొయ్యూరు, రుద్రారం, తాడిచర్ల, పెద్దతూండ్ల, మల్లారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటు ందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏడీఈ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రేగులగూడెంలో ఇంటి పైకప్పు తొలగించి చోరీ

కాటారం, మే 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెంలో పనకంటి రామ్మూర్తి అనే వ్యక్తికి చెందిన ఇంటి పైకప్పు తొలగించి ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..బంధువుల ఇంట్లో పంక్షన్ ఉండటంతో రామ్మూర్తి దంపతులు ఇంటికి తాళం వేసి ఊరికెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి పక్కనవారు రామ్మూర్తి ఇంటి పై కప్పు గూన తొలగించి ఉండటం గమనించి సమాచారం ఇచ్చారు. రా మ్మూర్తితో పాటు కుటుంబసభ్యులు హుటాహుటిన చేరుకుని పోలీసులకు సమాచార మిచ్చారు. దీంతో పీఎస్సై గీతారాథోడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువా పగులగొట్టిన దొంగలు అందులో ఏమి లభించకపోవడం తో ఏసీ కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లడానికిప్రయత్నించి విఫలం చెందారని బాధితుడు తెలిపాడు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మల్హర్, మే 5(ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2 లోపు అమలు చేయాలని ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మాణం చేసినట్లు మల్హర్ మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు బూడిద సతీష్ సోమవారం తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్, బోయిని రాజయ్య పాల్గొన్నారు.

గ్యాస్ గోదాముల యజమానులపై చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లిటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు గ్యాస్ విక్రయాలు జరుపుతున్న గోదాము యజమానులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సివిల్ సప్లై అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది గ్యాస్ గోదాముల యజమానులు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా గ్యాస్ సిలిండర్‌ను బయట విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుగొండ మహేందర్, మేకల ఓంకార్, మురారి సదానందం, దామోదర్ పాల్గొన్నారు.

జంగేడు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

భూపాలపల్లిటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం జంగేడు నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడుగా మంతెన వెంటేష్, ఉపాధ్యక్షులుగా దొంగల చిన్న ఐలయ్య, ఆకుల సాయిచరణ్, ప్రధాన కార్యదర్శిగా పినగాని మార్కండేయ, సహాయ కార్యదర్శిగా అట్యాపురం రాజేందర్, గౌరవ అధ్యక్షులుగా కుసుమ రాయమల్లు, సత్యనారాయణ, సారంగపాణి, రాజయ్య, కోశాధికారిగా తోట రాజయ్య, కార్యదర్శిగా రఘువాచారి, సభ్యులుగా సారంగపాణి, భూమయ్య, రాజమల్లు, నాగరాజు, సమ్మయ్య, లక్ష్మణ్, జనార్ధన్, సతీష్, మహేష్ ఎన్నికైనట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పశుగ్రాసం దగ్ధం

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదపల్లిలో విద్యుదఘాతంతో సోమవారం పశుగ్రాసం దగ్ధమయింది. విద్యుత్ తీగలు వదులుగా ఉండి వేలాడుతుండటంతో గాలికి ఒకదానికొకటి తాకి మంటలు లేచి 200లకు పైగా గడ్డి కట్టలు దగ్ధమైనట్లు బాధితుడు తెప్పల ప్రభాకర్ తెలిపారు. గతంలోనే వేలాడుతున్న తీగల మధ్య మిడిల్ పోల్స్ వేస్తామని విద్యుత్ అధికారులు చెప్పారని, ఇప్పటికీ పట్టించుకోక నష్టం జరిగిందన్నారు. రూ. 10వేల విలువచేసే పశుగ్రాసం దగ్ధమైనట్లు ప్రభాకర్ తెలిపారు.

గ్రామాల్లో 'జైబాపు.. జైబీమ్.. జైసంవిధాన్'

మంగపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురం, మంగపేట బోరునర్సాపురం మూడు గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, జైబాపు జైబీమ్ జైసంధాన్ మండల ఇన్‌చార్జి, కాంగ్రెస్ ఎస్టీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సోమవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామ నాయకులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 12 దరఖాస్తులు రాక

కాటారం, మే 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి ప్రజావాణిలో 12దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఇందులో అన్ని దరఖాస్తులు రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. భూముల సమస్యలు, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఏపీవో వెంకన్న, హెచ్‌వో మణి పాల్గొన్నారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

కృష్ణకాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలీలో గల ట్రాఫిక్ సిగ్నల్స్ గతరెండు రోజులుగా పని చేయడం లేదు. దీంతో వాహనాలు ఇష్టానుసారంగా రాకపోకలు సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ కూడలీ మీదుగా ప్రతీ రోజు వందల వాహనాలు రాకపోలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో సిగ్నల్స్ పని చేయకపోవడంతో వాహనాలన్నీ గజిబిజీగా వెళ్తున్నాయి. మహదేవపూర్ నుంచి లారీల రాకపోకలు ఉన్నందున ప్రమాదం జరగకముందే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.